# సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ చేసింది శూన్యం
- పదేళ్లుగా మెదక్‌ను పట్టించుకోని మైనంపల్లి
- మీ ఆడబిడ్డగా వస్తున్నా మళ్లీ ఆశీర్వదించాలి
- మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి


సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పద్మారెడ్డి

చిన్నశంకరంపేట, అక్టోబర్ 5: తెలంగాణ రాష్ట్రం సీఎం కేసీఆర్ సారథ్యంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని, 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏం చేసిందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఎమ్మెల్యేకు మంగళహారతులు, పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు. మండలంలోని గవ్వపల్లి తండాలో రూ.75 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు, జంగరాయి తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. చందాపూర్‌లో రూ.18 లక్షలతో నిర్మించిన పంచాయతీ, అంగన్‌వాడీ, మహిళా సమాక్య భవనాలను ప్రారంభించారు. అనంతరం మహిళలకు బతుకమ్మ చీరలు, యువతకు క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో రైతులను పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. కరెంటు, విత్తనాలు, ఎరువుల కోసం రైతులు రోజూ రోడ్డపైకి వచ్చి రాస్తారోకోలు, ధర్నాలు చేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులకు ఆ పరిస్థితి లేదన్నారు. రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి 24 గంటలు ఉచిత కరెంటును అందిస్తున్నారన్నారు. రైతుల కోసం రైతుబీమా, రైతు బంధు, పంట రుణమాఫీ వంటి సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నారన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి దేశంలోనే నెంబన్ వన్‌గా తీర్చిదిద్దారన్నారు. మెదక్‌ను జిల్లా కేంద్రంగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు.

**అప్పుడు పట్టించుకోని మైనంపల్లి ఇప్పుడేం చేస్తారు**

పదేళ్లుగా మెదక్ నియోజకవర్గాన్ని పట్టించుకోని మైనంపల్లి హన్మంతరావు ఇప్పుడు మెదక్ వచ్చి ఏం చేస్తారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రశ్నించారు. పదేళ్లుగా నియోజవర్గానికి దూరంగా ఉండి ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజలను ఓట్లు అడిగితే ఎలా వేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ చెప్పే మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఆడబిడ్డగా మళ్లీ మీ ముందుకు వస్తున్నా, నన్ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు పట్లోరి రాజు, ఎంపీడీవో ప్రవీణ్, ఈవో ప్రవీణ్, సర్పంచ్‌లు పడాల రమాదేవి, శ్రీనివాస్, గోపాల్‌నాయక్, రమేశ్ నాయక్, జ్యోతి లక్ష్మణ్, ఎంపీటీసీ యాదగిరి, సింగిల్ విండో చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, అంజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు కుమార్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్ నరసింహారెడ్డి, రాంరెడ్డి, నరేశ్, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం ఖాయం

- గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్
- ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు
- కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మవద్దు
- గుజరాత్‌లో 8 గంటల కరెంట్ కూడా ఇస్తలేరు
- కొల్లూర్‌లో ఒక్కరోజే 7,241మందికి ఇండ్ల పట్టాలిచ్చాం
- శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మాగంటి గోపినాథ్


కొల్లూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు

రామచంద్రాపురం, అక్టోబర్5: పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం కొల్లూర్‌లోని కేసీఆర్ టౌన్ షిప్‌లో జీహెచ్ఎంసీ పరిధిలోని శేరిలింగంపల్లి, జూబ్లీహిల్స్, చంద్రాయణగుట్ట, బహదూర్‌పురా, యాకుత్‌పురా నియోజకవర్గాలకు చెందిన 7,241 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా పేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించారన్నారు. గేటెడ్ కమ్యూనిటీలకు దీటుగా సకల సౌకర్యాలతో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. సీఎం కేసీఆర్ ఇప్పటివరకు చూపించింది ట్రైలర్ మాత్రమేనని, అసలు సినిమా ముందుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి నిధులు ఇవ్వకుండా వివక్ష చూపించినా, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించే అవార్డుల్లో రాష్ట్రానికే ఎక్కువగా వచ్చాయన్నారు. డెబ్బై ఏండ్లలో జరుగని అభివృద్ధిని పదేండ్లలో చేసి చూపెట్టిన మహా నాయకుడు సీఎం కేసీఆర్ అన్నారు. జిల్లాల్లో మెడికల్ కళాశాల, బస్తీ దవాఖానలు ఏర్పాటు చేసి, విద్యా వ్యవస్థను పటిష్టం చేశారన్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్, బీజేపీ నాయకుల అబద్ధపు మాటలు నమ్మి మోసపోవద్దని, సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించి హ్యాట్రిక్ సీఎంని చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో సింగిల్ లార్జెస్ట్ పార్టీ బీఆర్ఎస్ అని, బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతు అవసరం లేదన్నారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి వచ్చి పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో ప్రతిపక్ష పార్టీల నాయకులకు నిద్రపట్టడం లేదన్నారు. ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి, షాదీముబారక్‌తో పెండ్లిలకు సాయం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు పథకాలు వారు పాలిస్తున్న ఇతర రాష్ట్రాల్లో ఎందుకు అమలుచేయడం లేదని ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ పరిధిలో వరదలు వస్తే అప్పటి బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కారు పోతే కారు, బండి పోతే బండి ఇస్తామన్నారు, కాని ఇప్పుడు ఆ బండియే లేడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీలకు సీఎం అభ్యర్థులే లేరని, ఆయా పార్టీలను ప్రజలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీవో శ్రీనివాస్, జడ్సీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సంగ్రంరెడ్డి, ఉప తహసీల్దార్ విశ్వేశ్వర్, ఆర్ఐ శ్రీకాంత్, ఏసీపీ నర్సింహారావు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ

- సంగారెడ్డి జిల్లాలో పెరిగిన ఓటర్లు
- జిల్లా ఓటర్లు 13,55,958 మంది
- అత్యధికంగా పటాన్‌చెరులో 3,80,948 మంది
- రాజకీయ పార్టీల నాయకులతో జిల్లా రెవెన్యూ అధికారి నగేశ్


పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న డీఆర్వో

సంగారెడ్డి కలెక్టరేట్, అక్టోబర్ 5: ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని సంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి నగేశ్ స్పష్టం చేశారు. ఈనెల 4న తుది జాబితా వెలువరించిన నేపథ్యంలో గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగిందన్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 13,5,958 మంది జనరల్ ఓటర్లు, 125 మంది ట్రాన్స్‌జెండర్లు, 354 మంది సర్వీస్ ఓటర్లు, 74 మంది ఎన్ఆర్ఐలు ఉన్నారన్నారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా చేపట్టిన పలు కార్యక్రమాలతో పొలిటికల్ పార్టీల ప్రతినిధుల సహకారంతో ఓటరు నమోదు బాగా పెరిగిందన్నారు. దాదాపు లక్షా 13 వేల ఓటర్లు పెరిగారన్నారు. ఈసీ రేషియో సరాసరి 618 నుంచి 676కు పెరిగిందన్నారు. తుది ఓటరు జాబితా మేరకు నారాయణఖేడ్ నియోజకవర్గంలో 2,27,232 జనరల్ ఓటర్లు, 67 మంది సర్వీస్ ఓటర్లు, సంగారెడ్డిలో 2,38,336 జనరల్, 66 మంది సర్వీస్, 10 మంది ప్రవాస ఓటర్లు ఉన్నారని తెలిపారు. అందోల్‌లో 2,44,710 మంది జనరల్, 48 మంది సర్వీస్, ఐదుగురు ప్రవాస ఓటర్లు ఉన్నారన్నారు. జహీరాబాద్‌లో 2,64,732 మంది జనరల్, 103 మంది సర్వీస్, ముగ్గురు ప్రవాస ఓటర్లు, పటాన్‌చెరులో 3,80,948 జనరల్, 70 మంది సర్వీస్, 56 మంది ప్రవాస ఓటర్లు ఉన్నారన్నారు. 2018 జనరల్ ఎన్నికల్లో జిల్లాలో 1479 పోలింగ్ కేంద్రాలు ఉండగా, ప్రస్తుతం 1594 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అనంతరం 5 నియోజకవర్గాల తుది ఓటరు జాబితాను పరిశీలించాలన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం అధికారి దశరథ్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.


యువతకు స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్న ఎఫ్డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

# ప్రతి ఇంటికీ గృహలక్ష్మి చేరాలన్నదే లక్ష్యం

- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

తూప్రాన్, అక్టోబర్ 5:ప్రతి ఇంటికీ గృహలక్ష్మి పథకం చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గృహలక్ష్మి పథకం కింద మొదటి విడతలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలు, బతుకమ్మ చీరలు, యువతకు క్రీడా సామగ్రి, జిమ్ కిట్లను ఎలక్షన్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం నియోజకవర్గంలో ఉండడం తూప్రాన్ మండల ప్రజలు అదృష్టమన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో పది వేలకు పైగా గృహలక్ష్మి యూనిట్లు మంజూరయ్యాయన్నారు. తూప్రాన్ మండలంలో 900లకు పైచిలుకు యూనిట్లు మంజూరయ్యాయని, వారు ప్రొసీడింగ్ పత్రాలు కూడా అందుకున్నారని అన్నారు. వెంటనే ఇండ్లు నిర్మించుకోవడానికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఎలాంటి పైరవీలు లేకుండా మొదటి విడత రూ.లక్షను లబ్ధిదారుల అకౌంట్లలో జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ స్వప్నా వెంకటేశ్ యాదవ్, జడ్పీటీసీ రాణి సత్యనారాయణ, 'గడా' ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జైచంద్రారెడ్డి, ఎంపీడీవో అరుంధతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మాటల సర్కారు కాదు.. చేతల సర్కారిది

- టూరిజం స్పాట్‌గా తూప్రాన్ పెద్ద చెరువు
- మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్


పూజలు నిర్వహించి బోటును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్ గౌడ్

తూప్రాన్, అక్టోబర్ 5: బీఆర్ఎస్ ప్రభుత్వం మాటల సర్కారు కాదని, చేతల సర్కారని తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెద్ద చెరువును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ఏర్పాటు చేసిన బోటింగ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. గత నెల 27న తూప్రాన్‌లో మంత్రి హరీశ్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా తూప్రాన్ పట్టణ ప్రజల కోరిక మేరకు వారం రోజుల్లో బోట్లు పంపిస్తానని మాటిచ్చారు. మంత్రి ఇచ్చిన మాట ప్రకారం వారం రోజులు తిరగకుండానే తూప్రాన్ పెద్ద చెరువుకు బుధవారం బోట్లు పంపించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఒకప్పుడు తుమ్మ చెట్లు, తూటి పొదలకు నిలయమై, జనాలు సంచరించడానికే భయపడే పెద్ద చెరువు కట్ట, నేడు మినీ ట్యాంక్ బండ్‌గా రూపుదిద్దుకోవడం అభివృద్ధికి నిదర్శనమన్నారు. ఇరుకుగా ఉండి, చెరువు కట్టపై బైక్ కూడా సాఫీగా నడిపే పరిస్థితి లేకుండెనని, నేడు టూరిజం స్పాట్‌గా రూపుదిద్దుకుంటోందన్నారు. చెరువు కట్టపై ఇదివరకే చిల్డ్రన్స్ పార్క్, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశామన్నారు. అడిగిందే తడవుగా మాట ఇచ్చి వారం రోజుల్లో తూప్రాన్‌కు బోట్లు, డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద రేషన్ షాపు, అంగన్‌వాడీ కేంద్రాన్ని మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం కేసీఆర్‌ను వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. తూప్రాన్ మున్సిపల్ అభివృద్ధికి కోట్లాది రూపాయలు మంజూరు చేస్తున్న సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తూప్రాన్ మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, ఆర్డీవో జైచంద్రారెడ్డి, డీఎస్పీ యాదగిరిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు సతీశ్‌చారి, జడ్పీటీసీ రాణి సత్యనారాయణ, మత్స్య శాఖ మాజీ డైరెక్టర్ గడప దేవేందర్, కమిషనర్ మోహన్, సీఐ శ్రీధర్, ఎస్సై శివానందం, కౌన్సిలర్లు మామిడి వెంకటేశ్, శ్రీశైలంగౌడ్, రవీందర్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు సర్గల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.


బోటులో షికారు చేస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ఆర్డీవో, డీఎస్పీ